క్లుప్తంగా

6న గంగమ్మ ఆలయం ప్రారంభం

పుంగనూరు: మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో ఈనెల 6న శ్రీబురదగుంట గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 6, 7 తేదీల్లో జరిగే ప్రతిష్ఠాపనా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ

కుప్పం: ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కుప్పం ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఎలక్ట్రానిక్ మీడియా సభ్యుల సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, సంయుక్త కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా అక్రమ్, కార్యవర్గ సభ్యులుగా నిసార్, మురళి, తేజ్ కిరణ్, స్పందన్‌ను ఎన్నుకున్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం

కుప్పం: కుప్పంలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. గ్రంథాలయా అధికారిణి వాణి మాట్లాడుతూ ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు, శ్లోకాలు, శతక పద్యాలు, దైవభక్తి, దేశ భక్తి పెంపొందడంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 4 నుంచి 8 తరగతి లోపు విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

విజయకుమారికి డాక్టరేట్


విజయకుమారి

పుంగనూరు : పట్టణంలోని ఎన్ఎస్‌పేట కు చెందిన కె.విజయ కుమారికి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రదానం చేసింది. గైడ్ డాక్టర్ కృష్ణవేణి, ప్రొఫెసర్లు రాజేశ్వరి, వెంకట్రమణ పర్యవేక్షణలో ఆదెళ్లశివకుమార్ నవలలపై పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించడంతో వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆమె డాక్టరేట్ అందుకోవడంపై పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ, స్థానిక మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అంబుడ్స్‌మెన్ డాక్టర్ శివ అభినందించారు.

మద్యం సరఫరాపై నిఘా


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

పెద్దపంజాణి: కర్ణాట అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో మద్యం సరఫరా, నగదు పంపిణీపై నిఘా వేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రాజుపల్లె గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. దొంగ ఓట్లు, మద్యం సరఫరా, ఓటర్లకు నగదు పంపిణీ వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం 9 మందిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు.

మహా భారత ఉత్సవాలు ప్రారంభం


సోమల: ఆలయంలో పూజలు

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లె శ్రీధర్మరాజస్వామి ఆలయ మహా భారత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి 7 నుంచి నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు హరినాథ్, నాగభూషణంరెడ్డి, వీసీ కమిటీ చైర్మన్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

నదుం: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ మారుతి తెలిపారు. గురువారం వాహనాలు నిర్లక్ష్యంగా నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాదారులకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహన రికార్డులు వెంటే ఉంచుకోవాలన్నారు. ట్రిబుల్ రైడింగ్, తాగి వాహనం నడపడం నేరమని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కుప్పంరూరల్: కుప్పం మండలం, కృష్ణదాసనపల్లె వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. శాంతిపురం మండలం, చౌడంపల్లెకు చెందిన జయరామ్ వ్యక్తి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కుప్పం నుంచి గుడ్లనాయనపల్లె వైపు వెళ్తున్నాడు. కృష్ణదాసనపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వేగంగా వచ్చిన బొలేరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయరామ్‌ను స్థానికులు 108 ద్వారా పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు
- 9 రోజుల్లోనే రైతులకు సొమ్ము చెల్లింపు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ


మురారిపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె : రైతు సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని పలమనేరు ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. గురువారం మండలంలోని గాజిపేట, హరిజనవాడ, మురారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 250 గృహాలను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, సబ్సిడీ ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 80 శాతం పంటను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి తొమ్మిది రోజుల్లోనే సొమ్ము చెల్లించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి అందుతోందని, ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్న కొనసాగితేనే పేదల జీవితాలు మారుతాయన్నారు. కార్పొరేట్ చదువులతో సమానంగా పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించి బోధనా సామర్థ్యాలు పెంచినట్లు తెలిపారు. ఏటా వసతిదీవెన, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ రైతు భరోసా, వలంటీర్లకు వందనం, సీఎం కిసాన్, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా, వైఎస్సార్ మత్స్యకార భరోసా, విద్యాకానుక, అమ్మ ఒడి, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ చేయూత, పంట రుణాలు ఎన్నో పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తూ జగనన్న ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. టీడీపీ నేతల మాయ మాటలను నమ్మవద్దని, చంద్రబాబు వస్తే కరువేనని తెలిపారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు ఝాన్సీలక్ష్మి, నారాయణరెడ్డి, బాలకృష్ణగౌడు, రాజప్ప, చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యులు అభినవ్, వినాయకం, పార్టీ మండల కన్వీనర్ కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్లు పైజుల్లా, పీరూసాబ్, అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు తబ్రాజ్, నాగభూషణంరెడ్డి, వినోద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ


గంగాధరరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధరరెడ్డి కుటుంబాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పరామర్శించారు. గంగాధరరెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి ఐదు రోజుల క్రితం హఠాన్మరణం చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.అనంతరం ఆవులపల్లె వద్ద సీతమ్మ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

లోకోస్ యాప్‌పై సంఘమిత్రలకు శిక్షణ


శిక్షణకు హాజరైన సంఘమిత్రలు

బైరెడ్డిపల్లె : స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల సమగ్ర సమాచారం, నగదు లావాదేవీల నమోదు పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను రూపొందించిందని ఏపీఎం లలిత పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె మండల సమాఖ్య కేంద్రంలో గురువారం లోకోస్ యాప్ వినియోగంపై సంఘమిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాల బ్యాంకు రుణాలు, చెల్లింపులు, జీవనోపాధుల వివరాల సమగ్ర సమాచారాన్ని ఈ యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. సమాచారం, నగదు లావాదేవీలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ యాప్‌పై సంఘమిత్రలకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏరియా కో ఆర్డినేటర్ హరినాథ్, సీసీలు లక్ష్మయ్య, ఉమా, వసంతమ్మ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


రొంపిచెర్ల: పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి


శాంతిపురం : పింఛన్ అందిస్తున్న వలంటీర్

రొంపిచెర్ల: అనారోగ్యంతో తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లెకు చెందిన పి.మనోహర్‌కు వలంటీర్ పింఛన్ అందజేశారు. ఆయన ఐదు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నట్లు సమాచారం అందుకున్న వలంటీర్ లక్ష్మి తిరుపతికి వెళ్లి పింఛన్ అందించారు.

బెంగళూరుకు వెళ్లి..

శాంతిపురం: క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న శివరామపురానికి చెందిన నరసింహమూర్తి(93)కి బెంగళూరుకు వెళ్లి వలంటీర్ మురళి గురువారం పింఛన్ అందజేశారు. ఆయన బెంగళూరు కరుణశ్రీ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని వలంటీర్ అక్కడి వెళ్లి పింఛన్ అందజేశారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ యువరాజు తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్త్రీ శక్తి భవన్‌లో జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా ప్రతినిధులు తెలిపే సమస్యలను అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి అలసత్వం ఉండకూడదని పేర్కొన్నారు. అధికారులు ఆయాశాఖలకు ప్రగతి నివేదికలను, పనుల ప్రతిపాదన వివరాలను వివరించారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, సింగిల్‌విండో చైర్మెన్ శ్రీరాములరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొమ్మిది కేంద్రాల్లో పాలిసెట్


పాలిసెట్‌పై సమీక్షిస్తున్న ఆర్‌డీఓ శివయ్య

పలమనేరు: పలమనేరు,కుప్పంలో ఈనెల 10 తేదీన పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను పటిష్టంగా నిర్వహించాలని ఆర్‌డీవో శివయ్య సూచించారు. గురువారం కార్యాలయంలో కుప్పం, పలమనేరు పరీక్షల కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. పలమనేరులోని ఐదు సెంటర్లలో జరుగనున్న పాలిసెట్‌కు 1,927మంది, కుప్పంలో నాలుగు సెంటర్లలో 546 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. కోఆర్డినేటర్లు డాక్టర్ సుకుమార్, మహమూద్, శ్రీనివాసులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏడీ అన్నపూర్ణాదేవి

పలమనేరు: ఖరీఫ్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని డివిజన్ పరిధిలోని ఏవోలు, ఆర్‌బీకే సిబ్బందికి వ్యవసాయశాఖ సహాయసంచాలకులు అన్నపూర్ణాదేవి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సబ్సిడీ వేరుశెనగ విత్తనాలు, ఎరువుల పంపిణీపై ఆర్‌బీకేల వారీగా సిద్ధంగా ఉండాలన్నారు.
రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలందేలా చూడాలని తెలిపారు. ప్రస్తుతం జీలుగ, జనుము పంపిణీ చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఎప్పటికప్పుడు రైతులకు అందేలా చూడాలన్నారు. పొలంబడి, చిరు ధాన్యాలలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏడు మండలాల ఏవోలు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయం వద్ద అన్నదానం

పలమనేరు: పట్టణంలోని గంగమ్మ ఆలయంలో ఈనెల 14న జరుగనున్న జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతు న్నాయి. గురువారం స్థానిక ఆర్యవైశ్యులు ఉభయదారులుగా పూజలు జరిగాయి. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

7 నుంచి క్రికెట్ పోటీలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు కరెస్పాండెంట్ రవీంద్ర బాబు పేర్కొన్నారు. గురువారం పోటీల నిర్వహణ కరపత్రాలను కళాశాలలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి మొత్తం 32 జట్లు పాల్గొననున్నాయని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ. 20వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీటీఎఫ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని పెద్దచల్లారగుంట వద్ద డీటీఎఫ్(డిస్ట్రిక్‌టాస్క్‌ఫోర్స్), ఇంటెలిజెన్స్ అధికారులు గురువా రం కర్ణాటక నుంచి బైక్‌పై తెస్తున్న 864 టె ట్రా ప్యాకెట్లను తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకున్నట్లు డీటీఎఫ్ సీఐ మాధవస్వామి తెలిపారు. నిందితుడు బంగారుపాళెం మండ లం గౌరీపురానికి చెందిన జగదీశ్వర్(38)గా గుర్తించి అరెస్ట్ చేసి, బైక్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇతనిచ్చిన సమాచారంలోనే రానికి సహకరించిన ఇంద్రానగర్‌కు చెందిన కిరణ్(25)పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వలి, సిబ్బంది నాగరాజు, దస్తగిరి, దొరబాబు పాల్గొన్నారు.

గాండ్ల సంఘం కమిటీ ఎంపిక


ఎంపికైన కమిటీ సభ్యులు

పలమనేరు: గాండ్ల సంఘం మండల అడహాక్ కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు భూపేష్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్.రాజేంద్రన్, సభ్యులుగా మత్యం అశోక్‌కుమార్, ఆర్. బలరాం శెట్టి, ఏఆర్.కుమార్, కోదండరామయ్య, కుమార్, కేశవులు, టీకే షణ్ముగం, కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేద్దామని నూతన కమిటీ పిలుపునిచ్చింది.

కమనీయం.. కల్యాణం

బైరెడ్డిపల్లె: బేలుపల్లె పంచాయతీ పట్నపల్లె సమీపంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఆల య బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కల్యాణం కమనీయంగా జరిగింది. రంగు రంగుల పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీశ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వా యిద్యాల నడుమ కల్యాణం జరిగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు కల్యాణం తిలకించి పారవశ్యం చెందారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కో ఆర్డినేటర్ల సంఘం ప్రతినిధులు

పలమనేరు: ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మళ్లీ ఉద్యోగాలు ఇవ్వడంపై 2018లో తొలగించిన సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్లు గురువారం ముఖ్యమంత్రిని కలసి కృతజ్ఞతలను తెలిపినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దారెడ్డి తెలిపారు. తమ కష్టాలను గుర్తించి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మళ్లీ ఉద్యోగాలు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు.

నమో నారసింహా.. నమో భక్తపాల


పుంగనూరు : ఏడూరు ఆలయంలో విశేషాలంకరణ, దేవళంపేటలో ప్రత్యేకాలంకరణ

పుంగనూరు: నృసింహ జయంతి సందర్భంగా గురువారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, మండలంలోని ఏడూరు సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేషపూజలు, అలంకరణలు, హోమాలు నిర్వహించారు. నమో నారసింహా నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు నిష్ఠతో పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దేవళంపేటలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నృసింహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అనంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వంగా ద్రౌపదీదేవి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో శ్రీద్రౌపది, ధర్మరాజులస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. సుందరంగా ముస్తాబు చేసిన రథంపై ద్రౌపదీదేవి కొలువుదీరారు. రథంపై అర్జునుడు, ఉత్తర కుమారుడు వేషధారులు ఆశీనులయ్యారు. ఆలయానికి అర్ధ కిలోమీటర్ దూరంలోని గుడిసత్రం వద్దకు రథం చేరుకుంది. అక్కడ అర్జునుడు, ఉత్తరకుమారుని వేషధారులచే పశువుల మళ్లింపు(ఉత్తర గోగ్రహణం) ఘట్టం కోలాహలంగా జరిగింది. తదుపరి జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఉదయం ఆలయంలో ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

సూర్య తేజం.. చంద్ర వదనం


సూర్యప్రభపై కోనేటిరాయుడు


చంద్రప్రభపై శ్రీనివాసుని విహారం

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీకోనేటిరాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు గురువారం సూర్య,చంద్ర ప్రభలపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తదుపరి సర్వాలంకారభూషితుడైన స్వామివారు సూర్యప్రభపై కొలువుదీరారు. మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. స్వామివారి పాదాలపై భానుడి కిరణాలు స్పృశిస్తుండగా అత్యంత ప్రకాశవంతుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల్ సేవ కనులపండువగా సాగింది. శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు ఊయలలో సేదతీరుతుండగా భక్తులు వీక్షించి తరించారు. రాత్రి శ్రీకోనేటిరాయుడు చంద్రప్రభ వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో వాహన సేవలను తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ ఉంటుందని ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


కూరగాయలను పంపుతున్న శ్రీవారి సేవకులు

కూరగాయల వితరణ

పలమనేరు: కీలపట్ల శ్రీకోనేటి రాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమానికి అవసరమైన రెండు ఆటోల కూరగాయలను స్థానిక శ్రీవారి సేవకులు గురువారం అందజేశారు. శ్రీవారి సేవకులు కాప్పల్లి రవీంద్రారెడ్డి, సోమశేఖర్ నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

మసీదు భూమిని కాపాడాలని ధర్నా

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గెర్నిపల్లె గ్రామంలో మసీదు భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మైనారిటీలు ధర్నా నిర్వహించారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. సుమారు 30 సంవత్సరాల కిందట అదే గ్రామానికి చెందిన కాశీంసాబ్, హుస్సేన్‌సాబ్, చిన్నమియాసాబ్ సర్వే నంబర్లు 875/6,875/1,875/7లో 10 సెంట్ల భూమిని మసీదుకు విరాళంగా అందజేసారని వినతిలో పేర్కొన్నారు. ఈస్థలం పక్క రైతు మసీదు భూమిని ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ మురళి హామీఇచ్చారు.

రూ.5.25 లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

శాంతిపురం: అక్రమంగా నిల్వ ఉంచిన రూ 5.25లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం ఓ వ్యక్తిని రాళ్లబూదుగూరు పోలీసులు అరెస్టు చేశారు. పలమనేరు డీఎస్పీ సుధార్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపిన వివరాలు.. రాళ్లబూదుగూరు పోలీసులు సి.బండపల్లె పంచాయతీలోని ముద్దనపల్లె వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఒక కేసు కర్ణాటక మద్యంతో వచ్చిన కుప్పం మండలం కోనయగుంట గ్రామానికి చెందిన సి.సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రాబట్టిన సమాచారంతో కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్, రాళ్లబూదుగూరు ఎస్ఐ మునస్వామి నిందితుడు స్వగ్రామంలో దాచి ఉంచిన 912 క్వార్టర్ ప్యాకెట్లు, 90 మిల్లీల టెట్రా ప్యాకెట్లు 1,344తోపాటు 72 బీర్ బాటిళ్లను గుర్తించి సీజ్ చేశారు. బిసానత్తం వద్ద కర్ణాటక రాష్ట్రంలోని జై మారుతి వైన్స్ నుంచి మద్యం తీసుకువచ్చినట్టు నిందితుడు వెల్లడించారు. అలాగే అక్కడ క్యాషియర్‌గా ఉన్న వ్యక్తితో కలిసి, కర్ణాటక మద్యాన్ని తెచ్చి, అధిక ధరలకు విక్రయిస్తూ లాభం పంచుకుంటున్నట్టు విచారణలో చెప్పాడు. దీంతో క్యాషియర్‌పై కూడా కేసు నమోదు చేశారు.

బహిర్భూమికి వెళ్లి..చెరువులో జారిపడి..

గంగవరం: చెరువులో జారి పడి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. గంటావూరుకు చెందిన వజీర్ కుమారుడు రఫీ(21) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక సాయినగర్‌లో పెయింటింగ్ పనికి వచ్చి, మధ్యాహ్నం భోజనానంతరం గంగవరం గ్రామ సరిహద్దులోని కొత్త చెరువులో బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో కాలుజారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని వెలికితీశారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.